క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ శిబిరం నిర్వహిస్తామని, దీనిని కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్‌నేత్రాలయ ఆసుపత్రికి తరలించి ఆపరేషన్లు చేయిస్తామన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నిత్యాన్నదాన ట్రస్ట్‌కు శనివారం చిత్తూరు నగరం మురకంబట్టు కోడిగుట్టకు చెందిన మోతీష్ రూ.1,01,116 విరాళంగా ఇచ్చారు. ఆయనకు ఆలయ అధికారులు స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ రవీంద్ర బాబు, సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

17న 'వెలుగు పూల కోసం' పుస్తకావిష్కరణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): హరివిల్లు చిత్తూరు లలితా కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 17న వెలుగు పూల కోసం కవితా సంకలనం పుస్తకావిష్కరణ చేయనున్నట్టు నిర్వాహకులు మునస్వామి తెలిపారు. చిత్తూరులోని ఆర్‌ఆర్ హోటల్లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి సాహితీప్రియులు, రచయితలు పాల్గొనాలని ఆయన కోరారు.

ట్రాన్స్‌కో ఈఈ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ట్రాన్స్‌కో నిర్మాణ విభాగం ఈఈగా అమర్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తిరుపతి ఎంఅండ్‌టీ విభాగం ఈఈగా ఉన్న ఆయన బదిలీపై చిత్తూరుకు వచ్చారు. స్థానిక గాంధీ రోడ్డులోని నిర్మాణ విభాగం కార్యాలయంలో సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి పరిచయం చేసుకున్నారు. నూతన ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలియవచ్చింది.

బస్సులు కిటకిట



బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

బంగారుపాళెం: మండల కేంద్రం మీదుగా దూర ప్రాంతాలకు వెళ్లే వివిధ ఆర్టీసీ సర్వీసులు రద్దీతో ప్రయాణించాయి. దసరా సెలవులు ముగియడంతో స్వగ్రామాలకు నుంచి తిరుగు ప్రయాణమైన వారితో ఆదివారం సాయంత్రం స్థానిక బస్టాండ్ రద్దీగా కనిపించింది. ప్రధానంగా బెంగళూరు సర్వీసుల్లో సీట్ల కోసం ఎగబడ్డారు. సీట్లు ఖాళీగా లేకపోయినా నిలబడే గమ్యస్థానాలకు బయల్దేరారు.

మహా సమాధి పూజలు రేపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం కట్టమంచిలోని శ్రీవిశ్వ షిరిడి సాయిబాబా ఆలయంలో మంగళవారం మహా సమాధి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటలకు మూల విగ్రహానికి సర్వ పాలాభిషేకం, పలు హారతి పూజలు జరుగుతాయని తెలియజేశారు.

లారీలో మంటలు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పుంగనూరు: పట్టణ సమీపంలోని భగత్‌సింగ్ కాలనీ వద్ద గల బైపాస్ రోడ్డులో ఓ లారీ టైర్ పగిలి మంటలు చెలరేగాయి. ఆదివారం ఉదయం ఈ సంఘటన జరగడంతో వెంటనే ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో లారీలో ఉన్న వస్తువులు, లారీ పాక్షికంగా కాలిపోయాయి.

ఆలయ అభివృద్ధికి విరాళం

సదుం: మండల కేంద్రంలోని సాయిమందిరం అభివృద్ధికి ఆలయ ధర్మకర్త నాగభూషణంరెడ్డి, నాగరత్నమ్మ దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నమునుస్వామి, మేస్త్రీ నాగభూషణం, హరినాథ్, రామాంజులు, స్వామి పాల్గొన్నారు.

జలం.. ఫ్లోరైడ్ గరళం

మండలంలో ప్రజలకు సురక్షిత జలం కరువైంది. తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం పెరగడంతో ప్రజలకు వివిధ జబ్బుల బారిన పడుతున్నారు. కొన్నిప్రాంతాల్లో విధిలేక అందుబాటులో ఉంటున్న నీటినే అవసరాలకు వినియోగిస్తున్నారు. మరికొందరు మినరల్ వాటర్‌ను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా మండలంలో మినరల్ వాటర్ వ్యాపారం జోరందుకుంది.



గ్రామాల్లో విక్రయిస్తున్న వాటర్ క్యాన్లు

- నీటి కాలుష్యంతో పెరుగుతున్న రుగ్మతలు
- సురక్షిత నీటినే తాగాలంటున్న వైద్యులు

గుడిపాల: తాగునీటిలో ఫ్లోరైడ్‌శాతం పెరుగుతుండడంతో కాళ్ల వంకరలు, దంతాలు ఎర్రగా గారపట్టడం, పెరుగుదల లోపించడం వంటి సమస్యల బారిన పడుతున్నారు. ప్రజలకు తాగునీరు అందజేయాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి.

ట్యాంకుల్లో శుభ్రత ఏదీ ?

తాగునీరు సరఫరా చేస్తున్న ట్యాంకులను సరిగా శుభ్రపరచకపోవడంతో ప్రజలు తరచూ డయేరియా బారిన పడుతున్నారు. ఆస్పత్రుల పాలై జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ట్యాంకులను క్లోరినేషన్ చేసి ప్రతి 15రోజులకోసారి శుభ్రం చేయాలనే నిబంధనలు పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఫలితంగా కలుషిత జలం సరఫరా అయి ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు.

మినరల్ వాటర్ వైపు మొగ్గు చూపుతున్న ప్రజలు

నీటి కాలుష్యం నుంచి బయటపడేందుకు ఈమధ్య ప్రజలు మినరల్ వాటర్‌పై మొగ్గు చూపుతున్నారు. ఇళ్లలో అమర్చుకునేందుకు అనువుగా ఉన్న వివిధ నీటి శుద్ధీకరణ యంత్రాలను వాడుతున్నారు. మరికొందరు మినరల్ వాటర్ క్యాన్లను ఇళ్లకు తెప్పించుకుంటున్నారు. మండలంలో సుమారు 45 శాతం మంది క్యాన్ వాటర్‌ను తాగుతున్నారంటే నీళ్ల ఇక్కడ ఎలా ఉంటున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

మినరల్ క్యాన్ శుభ్రమేనా?

ప్రభుత్వ నిబంధన మేరకు మినరల్ వాటర్ కేంద్రాన్ని నిర్వహించేందుకు అనుమతి ఉండాలి.నీళ్ల క్యాన్లను తరచూ శుభ్రపరుస్తూ ఉండాలి. ఐఎస్ఐ ముద్ర ఉన్న క్యాన్లనే వినియోగించాలి. కానీ మండలంలో క్యాన్ వాటర్ నిర్వాహకులు నీటి శుద్ధీకరణ విషయంలో నిర్దేశిత ప్రామాణికాలు పాటిస్తున్నారా, లేదా? అని అధికారులు ఎవరూ తనిఖీ చేసిన పాపానపోవడం లేదు. లాభాల కాంక్షతో నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని చెబుతున్నారు.

> **సురక్షిత నీటినే తాగాలి**
>
> ట్యాంకుల శుభ్రం చేయకపోవడంతో ఫ్లోరైడ్ శాతం పెరిగి నీటికాలుష్యం అధికమవుతుంది. దీంతో వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన లేదా క్లోరిన్ మాత్రలతో శుద్ధిచేసిన లేక సురక్షిత మినరల్ వాటర్ అయినా తీసుకోవడం మంచిది.
>
> –సంధ్య, వైద్యాధికారి, గుడిపాల

సాహితీ ప్రక్రియ ప్రగతికి మార్గం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): విప్లవ సాహితీ ప్రక్రియ ప్రగతికి మార్గం చూపుతుందని చిత్తూరు జిల్లా రచయితల సంఘ గౌరవాధ్యక్షులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి అన్నారు. చిత్తూరు నగరం పీవీకేఎన్ సమీపంలోని మ్యాంగో భవన్‌లో శనివారం నెలవారి సాహితీ ప్రవంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. 1887 నుంచి 1943 మధ్యకాలంలో మూఢనమ్మకాలు, వివాహ వ్యవస్థలు, దైవారాధన తదితర విషయాలపై చర్చించారు. వీటిలో అస్తవ్యవస్థ విధానాలు, మనుషుల ఆలోచన విధానాలు తనదైన భావ విప్లవ సాహిత్యం ద్వారా సంస్కరించడానికి పురాణాలు, ఇతిహాసాలు ముఖ్యమైన ఘట్టాలన్నారు. తనదైన విప్లవ సాహిత్య ప్రక్రియతో త్రిపురనేని రామస్వామి చౌదరి సమానత్వ వ్యవస్థ కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు గిరిధరన్, ప్రధాన కార్యదర్శి సహదేవనాయుడు, కవులు మునస్వామి, అరుణకుమారి పాల్గొన్నారు.

మండలంలో 'ఉసురు' షూటింగ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉసురు అనే తమిళ సినిమా షూటింగ్ జరిగింది. నటి రాశితో పాటు పలువురు తమిళ నటీనటులతో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. మండలంలోని నల్లవెంకటయ్యగారిపల్లెలోని చెరువు వద్ద పలు సన్నివేశాలు, పెరుమాళ్లకండ్రిగ రోడ్డులో అంత్యక్రియల సన్నివేశాలు, తాళంబేడు ద్రౌపదమ్మ ఆలయం వద్ద మరికొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ షూటింగ్‌ను తిలకించేందుకు స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు వచ్చారు. రాశితోపాటు తమిళ నటులతో ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు.



నల్లవెంకటయ్యగారిపల్లె చెరువు వద్ద చేస్తున్న షూటింగ్

'గంటా'పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

చిత్తూరు కార్పొరేషన్: ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గంటామోహన్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం చిత్తూరులో నిర్వహించిన కార్మిక నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం డీఈఓను నిలదీసినందుకు కక్ష పెట్టుకుని గంటామోహన్‌ను సస్పెండ్‌చేయడం అన్యాయమన్నారు. చర్యలు ఉపసంహరించుకోకపోతే యూనియన్, అనుబంధ సంఘాలతో దశల వారీగా డీఈఓ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు వద్దకు సమస్యలను అర్జీ రూపంలో నివేదిస్తే సరైన సమాధానం చెప్పలేదని, ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోవడం..ప్రశ్నించడం, నిలదీయడం నేరమా? అని ప్రశ్నించారు. కలెక్టర్ జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజన్, మణి, రమాదేవి, ఏపీ మెడికల్ యూనియన్ నాయకులు దామోదరం, మణికంఠ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వినాయక, ఈశ్వరన్, ఐఎంఎఫ్ఎల్ డిపో ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ మురళి, సివిల్ సప్లై హమాలి నాయకులు కృష్ణ, బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు చాంద్‌బాషా, ఆర్ముగం, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు డేవిడ్, మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగరాజన్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బంగారుపాళెం: వాతావరణ కేంద్రం జారీ చేసిన తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. ఇదే విషయమై మండలంలోని గ్రామాల్లో ఆదివారం వీఆర్వోలతో దండోరా వేయించారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు వాగులు, వంకలు దాటడం, చెట్ల కింద ఉండరాదని, అలాగే కరెంటు స్తంభాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. తుపాను మూలాన ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఆయుధ పూజకు క్యూ కట్టిన భక్తులు



కిటకిటలాడుతున్న ఆయుధపూజ ప్రాంగణం

కాణిపాకం: విజయదశమి పర్వదినాన కాణిపాకంలోని వాహన పూజ మండపంలో శనివారం ఆయుధపూజలకు భక్తులు వాహనాలతో క్యూకట్టారు. ద్విచక్రవాహనం నుంచి కార్లు, పెద్ద వాహనాల సైతం బారులు తీరాయి. నిత్యం వాహన పూజలతో రద్దీగా ఉండే ఆ ప్రాంతం ఆయుధపూజ ప్రారంభంతో మరింత జన సందడిని సంతరించుకుంది. ఉదయం నుంచి రాత్రి వరకు కూడా వాహన పూజ మండపం భక్తజనంతో రద్దీగా కనిపించింది. వాహన మండపంలోని అర్చకులు వాహనాలకు పూజలు చేసి పూజా సామగ్రి అందజేశారు.

ఉత్సవాలు పరిసమాప్తం



గ్రామోత్సవంలో అమ్మవారు

కాణిపాకం: కాణిపాకంలో శ్రీవరసిద్ధి వినాయక దేవస్థాన అనుబంధ శ్రీ మణికంఠేశ్వరస్వామి ఆలయంలో శనివారంతో నవరాత్రి ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. అమ్మవారికి ఉదయం అభిషేక పూజలు, సాయంత్రం ప్రత్యేక కుంకుమార్చనను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. నిష్ఠతో జమ్మిచెట్టుకు పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని మహిషాసురమర్ధినిగా భక్తులను అనుగ్రహించారు. తదనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కాణిపాక ఆలయ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కోతుల బెడద

ఐరాల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కోతుల బెడద అధికంగా ఉండడంతో పలు ఇబ్బందులకు గురువుతున్నామని మండల ప్రజలు వాపోతున్నారు. గుంపులు, గుంపులుగా కోతులు సంచరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తుండడంతో పాటు ఇళ్లలోకి ప్రవేశించి, ఇంట్లోని ఆహార పదార్థాలు ఇతరత్రా వాటిని ఎత్తుకుపోతూ చిర్రెత్తిస్తున్నాయని, అలాగే మొక్కలను సైతం పెరిగి వీరంగం చేస్తున్నాయని గగ్గోలు పెడుతున్నారు. వాటిని తరిమేందుకు యత్నిస్తే దాడి చేసేందుకు యత్నిస్తున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి మండలంలోని పలు గ్రామాల్లోని కోతుల పట్టివేతకు చర్యలు తీసుకుని వాటి బాధల నుంచి విముక్తి కల్పించాలని పలువురు కోరుతున్నారు.



వీఎస్ అగ్రహారంలో బిల్డింగ్‌పై వానరాల గుంపు

వరసిద్ధుని సన్నిధిలో జేసీ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శనివారం జేసీ విద్యాధరి తమ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికి, ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేశారు.



చిత్రపటం అందుకుంటున్న జేసీ

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా ఏర్పాటైన రేవా (రాయల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్) గౌరవాధ్యక్షులు పార్థసారథి నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక కొంగారెడ్డి పల్లెలోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో రేవా అసోసియేషన్ ఏర్పాటు, కార్యవర్గం ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పెన్షనర్లు, ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగుల సంక్షేమం కోసం రేవా అసోసియేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఉద్యోగులకు, పెన్షనర్లకు ఎలాంటి సమస్యలు తలెత్తిన అసోసియేషన్ స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షునిగా పీఎంఆర్ ప్రభాకర్ (రిటైర్డ్ ఎంపీడీఓ), జనరల్ సెక్రటరీగా డీఆర్ మోహన్‌కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నరేష్‌బాబు, కోశాధికారిగా అగ్రహారం వెంకటేశులు, గౌరవ లీగల్ సెల్ అడ్వైజర్‌గా ప్రసన్నకుమార్, అసోసియేట్ అధ్యక్షులుగా వందవాసి వెంకటేశులు ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా సురేంద్రబాబు, యుగంధర్, చరణ్‌బాబు, జనార్దన్, సత్యనారాయణ, ఆదిమూర్తి, మురళీమోహన్, జాయింట్ సెక్రటరీలుగా సాయిరాకేష్, చాముండేశ్వరి, ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.



ఎన్నికైన రేవా అసోసియేషన్ నాయకులు

మానవతామూర్తి రతన్ టాటా

చిత్తూరు కలెక్టరేట్: దివంగత రతన్‌టాటా మానవతామూర్తి అని ఏపీటీఎఫ్ (257) జిల్లా అధ్యక్షులు గోపినాథ్ ప్రస్తుతించారు. ఆదివారం ఆ అసోసియేషన్ నాయకులు జిల్లా కార్యాలయంలో రతన్‌టాటా చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రతన్‌టాటా మరణం భారత పారిశ్రామిక రంగానికి తీరని లోటు అని అన్నారు. ఆయన కార్పొరేట్ రంగంలో ఉన్నత శిఖరమని, అలాగే పేదలు, మధ్యతరగతి ప్రజల కోసం ఎన్నో సామాజిక సేవలందించారని కీర్తించారు. ఆయన స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్తార్, నాయకులు శివశంకర్, అమర్‌నాథ్‌రెడ్డి, లక్ష్మీపతి, వాసు తదితరులు పాల్గొన్నారు.




రతన్‌టాటా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

భక్తిశ్రద్ధలతో విజయ దశమి







విజయలక్ష్మీ దేవిగా దుర్గాంబ, గుడిపాల: పానాటూరులో .., రాజరాజేశ్వరిదేవిగా అంకాళపరమేశ్వరి, బంగారుపాళెం: రాజరాజేశ్వరిదేవిగా ముత్యాలమ్మ, ఐరాల: పాలేటమ్మ గ్రామోత్సవం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలో శని, ఆదివారాల్లో విజయదశమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రెండు రోజుల పాటు పలు ఆలయాల్లో నిఅమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గిరింపేటలోని దుర్గాంబ దేవస్థానంలో అమ్మవారికి అభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం రాత్రి విజలక్ష్మీదేవిగా పుష్పరథంలో ఊరేగారు. ఆదివారం వసంతోత్సవం చేశారు. అమ్మవారు నగరవీధుల్లో విహరించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఇక, గుర్రప్ప నాయుడు వీధిలోని అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీరాజరాజేశ్వరిదేవిగా, ముత్యాలమ్మ ఆలయంలో రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చారు. అలాగే పవళింపు సేవలో కటాక్షించారు. కోదండరామస్వామి ఆలయంలో కృష్ణావతారంలో అలంకరించి పూజార్చనలు చేశారు. సాయిబాబా ఆలయంలో రాజరాజేశ్వరిదేవిగా అభయమిచ్చారు. ఈ ముగింపు ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

గుడిపాలలో..

గుడిపాల: శరన్నవ రాత్రుల ఉత్సవాల్లో భాగంగా పల్లూరులోని గంగమ్మ దేవాలయం, కందగిరి కొండ వద్ద ఉన్న మూలస్థాన దుర్గమ్మ, పానాటూరులో ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవార్లకు ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని కుంకుమార్చన చేశారు. కందగిరి కొండ వద్ద దుర్గమ్మ విజయలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



ఐరాల: చాముండేశ్వరి గ్రామోత్సవం

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలంలో విజయదశమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా చివరిరోజు మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ శ్రీరాజ రాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం జలకంఠేశ్వర స్వామి, బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. బంగారుపాళెంలోని ముత్యాలమ్మ శ్రీరాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. ఓటీకే వీధిలోని సత్యమ్మ ఆలయం, రాజావీధిలోని ఓంశక్తి ఆలయం, మొగిలివెంకటగిరిలో గంగమ్మ ఆలయం, బ్రహ్మానందాశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. విజయదశమి రోజున వ్యాపారస్తులు దుకాణాలకు, వాహనదారులు వాహన పూజలను ఘనంగా చేశారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని నారసింహనపల్లెలో ఆదివారం దుర్గాదేవికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. నైవేద్యం సమర్పించారు. కె.పట్నంలో సత్యమ్మను అభిషేకించి, పసుపు, కుంకుమ, గంధం, సుగంధ పరిమళ పుష్పాలు, విద్యుద్దీపాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ధూపదీపనైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అలాగే తవణంపల్లె, జొన్నగురకలతో పలు గ్రామాల్లో అమ్మ వారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఐరాలలో..

ఐరాల: నవరాత్రి ఉత్సవాల్లో చివరిరోజు శనివారం స్థానిక గ్రామ దేవత పాలేటమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. పాతపాళ్యం ఓం శక్తి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు అనుగ్రహించారు. వైఎస్.గేటులోని చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో విజయదశమి పర్వదినాన ఉదయం ధ్వజావరోహణం, మహానివేదనం, అమ్మవారికి మహామంగళ హారతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. చాముండేశ్వరి అలంకారంలో భక్తులకు కటాక్షించారు. ఉదయం, సాయంత్రం చెక్క భజన, డప్పు వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు.

21లోపు దరఖాస్తు చేసుకోండి

పుంగనూరు: డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు టెట్ అర్హత కలిగిన వారు ఈనెల 21లోపు ఉచిత శిక్షణకు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని సోషియల్ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహులు కోరారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీలో శిక్షణ కోసం దరఖాస్తు చేసే వారికి ఈనెల 27న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు. దీని ద్వారా శిక్షణ అభ్యర్థులను ఎంపిక చేసి వారికి మూడు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్టు తెలియజేశారు.

గ్రామదేవతకు పొంగళ్లు



పొంగళ్లు పెట్టడానికి వెళ్తున్న మహిళలు

చౌడేపల్లె: మండలంలోని పాలెంపల్లె గ్రామదేవత బోయకొండ గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని 50 కుటుంబాల మహిళలు భక్తిశ్రద్ధలతో గ్రామానికి సమీపంలోని అమ్మవారి ఆలయం వద్దకు చేరుకొని పొంగళ్లు పెట్టి, పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

పశువధపై చర్యలు తీసుకోండి

పుంగనూరు: పుంగనూరు సంత నుంచి ప్రతి వారం 50 లారీల్లో పశువులను తరలిస్తూ పశువధ చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ ముక్తిమోర్చ రాష్ట్ర కార్యదర్శి అయూబ్‌ఖాన్ కోరారు. ఆదివారం పలమనేరు డీఎస్పీ ప్రభాకర్‌ను బీజేపీ నేతలు నరసింహులు కలసి వినతిపత్రం అందజేశారు.